
# ఆత్మవిజ్ఞానం



బ్రహ్మర్షి పత్రీజీ

# ఆత్మ విజ్ఞానం

" ఆమూలాగ్రం " అంటే " మూలం నుంచి అగ్రం వరకూ, from the beginning to end ", అంటే " మొదటి నుండి తుది వరకూ " అన్న మాట !

ఆత్మ విజ్ఞానం స్పిరిచ్యువల్ సైన్స్ - అంటే ఆత్మ యొక్క విశేషమైన జ్ఞానం - అదే " ఆత్మవిజ్ఞానం ".

' జ్ఞానం ' అన్నది వేరే. ' విజ్ఞానం ' అన్నది వేరే ! ' జ్ఞానం ' అన్నది విజ్ఞానం యొక్క సూక్ష్మరూపమైతే, ' విజ్ఞానం ' అన్నది జ్ఞానం యొక్క విశ్వరూపం ! ఆత్మ యొక్క స్థూల అవగాహన ' జ్ఞానం '; అయితే ఆత్మ యొక్క విశేష పరిస్థితులను ' విజ్ఞానం 'లోనే తెలుసుకుంటాం.

ముఖ్యంగా " నేను శరీరం కాదు, ఆత్మను " అని అనుభవపూర్వకంగా ఎవరైతే తెలుసుకుంటారో వాళ్ళు ' జ్ఞాని ' అనబడతారు. ' ఆత్మజ్ఞాని ' అనబడతారు. ఎవరికైతే ఈ అనుభవం లేదో, " ఈ దేహమే నేను " - అని అనుకుంటారో వారు ఆత్మజ్ఞానులు కారు; వారు ' అజ్ఞానులు ' అని పిలవబడతారు !

ఆధ్యాత్మిక పరిభాషలో జ్ఞానులు అంటే ఆత్మజ్ఞానం ఉన్నవారు. ' అజ్ఞానులు ' అంటే ' ఆత్మజ్ఞానం లేనివారు ' అని అర్థం. అంతేకానీ ప్రాపంచిక జ్ఞానంతో దానిని పోల్చకూడదు. గొప్ప సంగీత పండితులే కావచ్చు,

ప్రధానమంత్రులే కావచ్చు రాజులే కావచ్చు - కానీ వాళ్ళకు ఆత్మజ్ఞానం లేకపోతే వారిని కూడా ' అజ్ఞానులు ' అనే అంటాం ! అలా అన్నప్పుడు అది వాళ్ళని ' కించపరచినట్టు ' కాదు ! అది ఒక ' నిర్వచనం ' మాత్రమే !

ఎలాగైతేనేం సంగీతం రాని వాడిని ' సంగీతం రానివాడు ' అని అంటామో, కుంటివాడిని ' కుంటివాడు ' అని అంటామో, గ్రుడ్డివాడిని ' గ్రుడ్డివాడు ' అని అంటామో - అలాగే ఆధ్యాత్మిక పరిభాషలో, ' అజ్ఞాని ' అని ఆత్మజ్ఞానం లేనివాడు పిలవబడతాడు.

ఎవరైతే ధ్యానం చేసి ఈ స్థూల శరీరం నుంచి సూక్ష్మ శరీరాన్ని బయటకు తీసుకువచ్చి " ఈ దేహం నేను కాదు " అని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారో వారికి మొట్టమొదటిసారిగా " ఆత్మజ్ఞానం అంకురించింది " అని అంటాం.

ఒకానొక సంగీతం రాని మనిషి ఒకానొక సంగీత గురువు దగ్గరికి వెళ్తే ఆ సంగీత గురువు " మొదట స, ప, స లు పట్టు నాయనా ! " అంటాడు. ఆ తరువాత ' సరిగమపదనిస ' అనే సప్తస్వరాలు మెల్లగా వస్తాయి. ఇలా రోజూ మెల్ల మెల్లగా అభ్యాసం చేస్తే సంగీతంలో ' గురువు 'గా అచిరకాలంలో తప్పక తప్పక అవుతాడు.

అలాగే, ఎవరైతే ఆత్మజ్ఞానులుగా కాదలచుకున్నారో అలాంటి వారు ఆత్మజ్ఞానం వున్న గురువు దగ్గరకు వెళ్ళి " నాకు ఆత్మజ్ఞానం కావాలి. నేర్పించండి ! " అని అంటే ఆయన " మొదట ఆధ్యాత్మిక స, ప, సలు పట్టు నాయనా ! " అంటాడు. అంటే, " కాళ్ళు, చేతులు, నోరు కట్టేసుకుని, కళ్ళు రెండూ మూసుకుని మనస్సుని కట్టేసుకుని - ఆనాపానసతి అభ్యాసం ద్వారా - దివ్యచక్షువుని ఉత్తేజితం చేసుకో " అని చెపుతాడు. ఈ విధంగా మెల్ల మెల్లగా అభ్యాసం చేస్తే అచిర కాలం లోనే అపార శక్తిమంతుడై స్థూల శరీరం నుంచి సూక్ష్మశరీరాన్ని విడుదల చేసుకుని, తన దివ్య చక్షువు ద్వారా దివ్యదృష్టిని పొంది, " నేను ఆత్మను " అనే అనుభవాన్ని పొంది, " ఈ స్థూల ప్రపంచమే కాక ఈ సృష్టిలో ఇంకా ఎన్నో అనేకానేక లోకాలు (alternate frequency - universes) కూడా వున్నాయి " అని తెలుసుకుంటాడు !

అప్పుడు, మొట్టమొదటిసారిగా ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకుని ' ఆత్మజ్ఞాని ' అవుతాడు. అంటే ' పాలు ' అన్నది ' పెరుగు ' గా అయ్యిందన్నమాట. పాలు ' పెరుగు 'గా కావడానికి ఓ చిన్న పెరుగు బిళ్ళ ఎలా ' తోడు ' గా అవసరమో అట్లాగే ఒకానొక సాధకుడికి గురువు చెప్పే ఒకేఒక మాట వల్ల - అంటే ' ఆనాపానసతి ' అనే ' తోడు ' వల్ల, మరి స్వంత అభ్యాసం వల్ల - పాలు ' పెరుగు ' అయిపోయి ' జ్ఞానం ' అంకు రిస్తుంది ! అంతవరకూ ఆ ఆత్మకి జ్ఞానం లేదు. ఎన్నో జన్మలు ధరించాడు. దేహజ్ఞానమే వుంది. " నేను నల్లగానే, తెల్లగానే వుంటాను ! ", " నేను ఒక ఆడ/ఒక మగ " అనే జీవించాడు. " నా వయస్సు 20 సం॥లు, లేదా 30 సం॥లు " అనే దేహపరంగా అనుకున్నాడు. అయితే ఎన్నో దేహజ్ఞానపు జన్మల తర్వాత చివరి జన్మల్లో ఈ ఆత్మజ్ఞానం అన్నది తప్పక అలవడుతుంది.

దీనినే శ్రీ కృష్ణుడు -

" మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్ మాం వేత్తి తత్త్వతః ॥ "

అన్నాడు.

" వేలకొద్దీ మనుష్యుల్లో కొంతమందే సత్యం కోసం, సిద్ధత్వం కోసం ప్రయత్నిస్తారు; అలాంటి వేల మందిలో కొద్దిమందే పూర్ణ సత్యాన్ని చేరుకుంటారు; అంటే " నేను " అనే పదార్థాన్ని యథార్థంగా తెలుసు కుంటారు " అని శ్రీకృష్ణులవారు చక్కగా చెప్పారు.

" ఆత్మ విజ్ఞానం " గురించి తెలుసుకునే ముందు ' జ్ఞానం ' అంటే ఏమిటో, ' ప్రజ్ఞానం ' అంటే ఏమిటో తెలుసుకుందాం.

ఆత్మజ్ఞానం దేనిలో సిద్ధం అవుతుంది. ' ధ్యానం ' లో సిద్ధమవుతుంది. ధ్యానం ' ఆనాపానసతి 'లో సిద్ధం అవుతుంది. ' జ్ఞానం ' అంటే ' నేను ఆత్మను ' అని తెలుసుకోవడం !

జ్ఞానం తరువాతది ప్రజ్ఞానం !

' ఆత్మప్రజ్ఞాని ' ప్రతి చెట్టులోనూ, ప్రతి పుట్టలోనూ తననే చూసు

కుంటాడు. " సకల సృష్టి తానే " అని తెలుసుకుంటాడు. ఎప్పుడైతే " వున్నదంతా తానే " అని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడో అప్పుడు " ఆత్మ ప్రజ్ఞానం వచ్చింది " అన్నమాట ! ' జ్ఞానం ' పెరిగిపోయి ' ప్రజ్ఞానం ' వచ్చింది అన్న మాట ! అప్పుడు " అహం బ్రహ్మాస్మి " అనీ, మరి " అయమాత్మా బ్రహ్మ " అనీ తెలుసుకుంటాడు. ఇంతకు ముందు ఆత్మజ్ఞానం స్థాయిలో " అయ మాత్మా ! " అని మాత్రమే అంటాడు.

మొట్టమొదట్లో అజ్ఞానపు దశల్లో " నేను ఒక జీవుడ్ని " అని అంటాడు; దాని తర్వాత జ్ఞానదశలో " నేను ఒక జీవాత్మని " అని అంటాడు. ఇంకొంచెం ఎదిగిన తర్వాత ' ప్రజ్ఞానదశ 'లో " నేను బ్రహ్మాన్ని; నేను సర్వాత్మని " అని అంటాడు.

అజ్ఞానం దశలో " నేను దేహాన్ని; నేను ఫలానా వారి కుమారుడిని; నేను భారతదేశవాసిని; నేను పాకిస్థానీయుడిని; నేను ఆడ; నేను మగ " అని దేహతత్వాన్ని తనకు తాను ఆపాదించుకుంటాడు. కానీ ధ్యానంలో ధ్యానాను భవాలను సంతరించుకున్నాక ప్రప్రథమంగా " నేను ఒక ఆత్మను; అయ మాత్మా ! " అని అంటాడు. ' నేను దేహాన్ని ' అన్న స్థితి నుంచి ' నేను ఆత్మను ' అన్న స్థితికి ఎదుగుతాడు. అంటే, అజ్ఞానం నుంచి జ్ఞానానికి చేరుకుంటాడు అన్నమాట. ఇదే ఆత్మజ్ఞాన స్థితి ! ఆ తర్వాత " నేను ఒక ఆత్మను " అనే స్థాయి నుంచి " నేను సర్వాత్మను, నేను పూర్ణాత్మను " అనే స్థితికి ఎదగడాని ' ఆత్మ యొక్క ప్రజ్ఞానం ' అని అంటాం.

ఆత్మ ' జ్ఞానం ' వేరు, ఆత్మ ' ప్రజ్ఞానం ' వేరు ! ' ఆత్మజ్ఞానం ' అనే ' బీజస్థాయి ' నుంచి ' ఆత్మ ప్రజ్ఞానం ' అనే ' మొక్కస్థాయి 'కి ఎదిగాడు అన్నమాట ! అయితే ' ఎదిగిన మొక్క ' అన్నది ' వృక్షం ' కాదు కదా ! " మరి ' వృక్షం ' ఏదయ్యా ? ' అంటే ' ఆత్మవిజ్ఞానమే ' వృక్షం !

" ఆత్మ విజ్ఞానం " అన్నది ఆత్మజ్ఞానం యొక్క పరాకాష్ఠ ! అంటే అది - ఆ ఆత్మవిజ్ఞానం అన్నది - ఓ మహావృక్షం ! అంటే అది మహా అనంతం ! ఆత్మజ్ఞానం అన్నది అంతం; ఆత్మప్రజ్ఞానం అన్నది అంతం; కానీ ఆత్మవిజ్ఞానం అన్నది అనంతం ! బీజం లేదా బీజదశ అన్నది అంతం. కొన్ని రోజుల తరువాత మొలక వచ్చి బీజదశ అంతం అవుతుంది. అలాగే మొలకెత్తిన ' మొలక '

కొన్ని రోజుల అయ్యాక అంతమై 'వృక్షం 'గా మారుతుంది. కానీ వృక్షదశ అనంతం. అది అలాగే ఎప్పటికీ వుంటూనే వుంటుంది. ఇంకా, ఇంకా చక్కగా వ్రేళ్ళూనుకుని, ఇంకా నిలకడగా, మరింత నిలకడగా వుండి అలా, అలా సదా విస్తరిస్తూనే వుంటుంది.

'ఆత్మ విజ్ఞానం ' అనంతం ! అది అలా సాగిపోతూనే వుంటుంది ! ఎంత తెలుసుకున్నా ఇంకా ఇంకా తెలుసుకోవాలని వుంటూనే వుంటుంది !

ఎలాగైతే యవ్వనం వచ్చినప్పుడు బాల్యదశ అంతమైపోతుందో, అలాగే " ఆత్మ ప్రజ్ఞానం " వచ్చినప్పుడు ఆత్మజ్ఞానం అంతం అవుతుంది. ఎలాగైతే పూర్తిస్థాయిలో మనిషి ఎదిగాక ప్రౌఢదశ అంతం అవుతుందో అలాగే ఆత్మప్రజ్ఞానస్థితి అంతమై " ఆత్మ విజ్ఞానం " మొదలవుతుంది. అయితే ఆత్మవిజ్ఞానం మాత్రం అంతం లేనిది ! దాని పరిధి అనంతం !

అందులో కూడా ' మహావిజ్ఞాని ', ' పరమవిజ్ఞాని ' అని కూడా చెప్పకోవచ్చు ! ఆత్మ విజ్ఞానం అన్నది ఆత్మప్రజ్ఞానం కన్నా పై మెట్టు ! ఆత్మప్రజ్ఞానం అన్నది ఆత్మజ్ఞానం కన్నా పై మెట్టు ! ఆత్మజ్ఞానం అన్నది అజ్ఞానం కన్నా పై మెట్టు ! అజ్ఞానం అన్నది విపరీతజ్ఞానం (వితండవాదం) కన్నా పై మెట్టు !

వితండవాది అంటే " దేవుడు అసలే లేడు " అని ఖచ్చితంగా వాదించేవాడు - అంటే ' కుజ్ఞాని ' అన్నమాట. కుజ్ఞాని అజ్ఞాని కన్నా క్రింది స్థాయివాడు. జ్ఞానానికి పూర్తి వ్యతిరేకదిశలో పోతున్నవాడు.

" అజ్ఞాని " అంటే " ఏమో నాకు దైవత్వం గురించి తెలియదు; దాని గురించి అవగాహన లేదు " అనేవాడు. ఎప్పుడైతే ఓ అజ్ఞాని " ఈ దైవత్వం ఏమిటి ? " అని తెలుసుకోవాలని అనుకున్నప్పుడు, ఒక నిజమైన గురువు దగ్గరికి వెళ్ళినప్పుడు, మొట్టమొదటిసారిగా ' ధ్యానం ' గురించి నేర్చుకుంటాడు. ధ్యానంలో, తన ధ్యాన అనుభవాల పరంపరలో, తన సూక్ష్మశరీరాన్ని వెలువరిస్తాడు; తన చర్మచక్షువులనూ, మనోచక్షువులనూ మూసుకుని తన దివ్యచక్షువు ద్వారా " తాను ఆత్మయే కానీ ఈ దేహం

కాదు " అని తెలుసుకుంటాడు. ఆ స్థితినే " ఆత్మజ్ఞానం అంకురించింది " అని అంటాం.

మెల్లిమెల్లిగా, ప్రత్యక్షంగా, ఎన్నో లోకాలను ధ్యానంలో చూసినప్పుడు, ముఖ్యంగా సర్వ దేశ కాల పరిస్థితులలోనూ తనను తాను చూసుకున్నప్పుడు " ప్రజ్ఞానం అంకురించింది " అని అంటాం. " నేను దేహం కాదు, ఆత్మను " అని తెలుసుకున్నప్పుడు 'జీవాత్మ' అనీ, " నేను ఈ ఆత్మనే కాక అందరిలోనూ వున్నదీ నేనే " అనీ, అంటే తనను తాను 'సర్వాత్మ'గా తెలుసుకోవడం ' ప్రజ్ఞానం ' అనీ, తర్వాత అంకురించేది ' విజ్ఞానం ' అనీ అంటాం.

ఇక అప్పటి నుంచి ' రీసెర్చి ' మొదలవుతుంది. తన గత జన్మల వివరాల గురించి అనేకానేకం తెలుసుకుంటాడు. గతంలో తాను ఏ ఏ తప్పులు చేసాడో, ఏ ఏ ఒప్పులు చేసాడో తెలుసుకుంటాడు. " ఏ ఏ లోకాలు వున్నాయి? కృష్ణుడు ఇప్పుడు ఏ లోకంలో వున్నాడు? " మొదలైన విషయాలు తెలుసు కుంటాడు. అనేక లోకాల యొక్క విశిష్ట వైవిధ్యాలు ' ఈ ఆత్మవిజ్ఞాన దశ 'లో తెలుసుకుంటాడు. ఇవన్నీ అధ్యయనం చేసేవాడే spiritual research scientist ! మౌలికమైనవి తెలుసుకుంటే వచ్చేది " జ్ఞానం "; విశేషమైన పరిశోధనలు చేస్తే వచ్చేది " విజ్ఞానం " !

తన దగ్గర నుంచి తాను నేర్చుకుంటే ' జ్ఞానం ' వస్తుంది. మరి ఇతర మాస్టర్ల దగ్గర నుంచి నేర్చుకుంటే ' విజ్ఞానం ' వస్తుంది. ఒక సైంటిస్ట్ ఎప్పుడూ ఒక గ్రంథాలయంలో కూర్చుని ఎంతో మంది ఇతర సైంటిస్టుల పుస్తకాలనూ, వారి వారి పరిశోధనలనూ పరిశీలిస్తూంటాడు. " అమెరికాలో, న్యూజిలాండ్ లో తాను జరిపినటువంటి పరిశోధనలను వారు ఎలాగ చేశారు? ", " వాళ్ల అనుభవాలు ఎలా వున్నాయి ? " అని సరిచూసుకుంటూ, ఎప్పటికప్పుడు తన విజ్ఞానాన్ని విస్తృత పరచుకుంటూంటాడు. అలాగే " న్యూటన్ ఏం చెప్పాడు; ఐన్‌స్టీన్ ఏం చెప్పాడు? " అని మిగతా సైంటిస్టుల పరిశోధనలను తాను ఉపయోగించుకుంటాడు. తాను మాస్టర్ అయ్యాక మిగతా ఇతర మాస్టర్స్ యొక్క పరిశోధనలు అధ్యయనం చేసేవాడే " Master of Masters " లేదా " జ్ఞానేశ్వరుడు " అవుతాడు.

ఇలాగ ఆత్మ ' జ్ఞాన ' దశ నుండి ఆత్మ ' విజ్ఞాన ' స్థితిలో ప్రవేశించిన తర్వాత నిరంతర పరిశోధన అన్నది వుంటుంది; అప్పుడు స్పిరిచ్యువల్ సైంటిస్ట్ (spiritual scientist) అవుతాడు. జీసస్ ఓ ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞుడు; అతను ఓ ఆధ్యాత్మిక విజ్ఞాన ఆచార్యుడు ! Jesus is a spiritual scientist ! He is professor of Atmavignana ! అలాగే గౌతమబుద్ధుడూ, మహావీరుడూ కూడా ! మనమందరం కూడా ఆ స్థాయికి ఎదగాలి ! మహా ఆత్మవిజ్ఞానులం కావాలి !

' జ్ఞానం 'తోనే సరిపుచ్చుకునేవాడు జ్ఞాన మూర్ఖుడు ! ' ప్రజ్ఞానం ' తోనే సరిపుచ్చుకునేవాడు ప్రజ్ఞానమూర్ఖుడు ! కానీ ' విజ్ఞానం ' వచ్చాక సరిపుచ్చుకోవడం అంటూ వుండదు ! అది ఎప్పుడూ అనంతవాహినిలాగా అలా అలా ప్రచండంగా కొనసాగుతూనే వుంటుంది !

నేను మొట్టమొదట ' ఆత్మవిజ్ఞానం ' సంపాదించింది. 1979లో లోబ్‌సాంగ్ రాంపా (Lobsong Rampa) గారి " యు ఫరెవర్ " (You Forever) అనే పుస్తకం ద్వారా (అది తెలుగులో ' ' మరణం లేని మీరు ' 'గా శ్రీ పి.జి. రామ్మోహన్ గారు అనువదించారు) ! నాకు ' ఆత్మజ్ఞానం ' 1976లో మిత్రుడు శ్రీరామచెన్నారెడ్డి గారి ధ్యానానుభవాల ద్వారా అంకురించింది. అప్పుడే దివ్య అనుభవాలైన " clairvoyance, telepathy " ల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. తర్వాత " అంతా నేనే " అనే అనుభవం పొంది ' ఆత్మ ప్రజ్ఞానం ' స్థితికి చేరాను ! ఆత్మ విజ్ఞానం మాత్రం లోబ్‌సాంగ్ రాంపా గారి ద్వారానే వచ్చింది ! ఆయన ఆత్మజ్ఞాని ఆత్మప్రజ్ఞాని కాదు, ఆయన ఓ మహా ఆత్మవిజ్ఞాని ! అంటే ఆయన ' ఆత్మ బీజం ', ' ఆత్మ మొలకా ' కాదు ! ' ఆత్మ వృక్షం ', ' ఆత్మ వటవృక్షం ' !

అని బీసెంట్, లెడ్ బీటర్, రిచార్డ్ బాక్ - వీళ్ళందరూ ఆత్మవిజ్ఞానులు. ' బీజ సమాన ' ఆత్మజ్ఞాన పుస్తకాలూ వున్నాయి. ' మొలక సమాన ' ఆత్మప్రజ్ఞాన పుస్తకాలూ వున్నాయి. అలాగే ' వృక్ష సమాన ' ఆత్మ విజ్ఞా న పుస్తకాలూ వున్నాయి ! మొట్ట మొదటి నుంచీ, నేను ' వృక్ష సమాన ' ఆత్మవిజ్ఞానాన్నే అర్థించాను; అందులోనే మరి అందరినీ అభ్యాసం నిరంతరంగా చేయిస్తున్నాను !

ఆత్మజ్ఞానులకీ, ఆత్మప్రజ్ఞానులకీ ఈ ఆత్మవిజ్ఞానులు అంతుపట్టరు ! మరొక ఆత్మవిజ్ఞానికి మాత్రమే ఒకానొక ఆత్మవిజ్ఞాని అర్థమవుతాడు ! అజ్ఞానికీ, జ్ఞానికీ ఎంత తేడా వుందో ఆత్మజ్ఞానికీ, ఆత్మవిజ్ఞానికీ మరి అంతే తేడా వుంది !

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లందరూ ఆత్మవిజ్ఞానాభిలాషులు ! ఆత్మవిజ్ఞాన విద్యార్థులు ! ఆత్మవిజ్ఞాన నిష్ణాతులు ! అనేకానేక లోకాలు తిరిగిన వారు. అనేకానేక లోకాలకు సంబంధించినవారు. తమ తమ జన్మపరంపరల పరంగా ఆఖరి జన్మలో వున్నవారు.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ;

" ఆ బ్రహ్మ భువనాల్లోకా పునరావర్తినోర్జున ।
మాముపేత్య కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥

అని అంటాడు. అంటే, " ఉన్న ఈ భువన లోకాల్లో బ్రహ్మలోకా (తపోలోకం) నికి వెళ్ళినా నువ్వు మళ్ళీ మళ్ళీ పుట్టవలసిందే ! కానీ ' నేను ఉన్న స్థితి ' కి అంటే ' సత్యలోకం ' చేరితే మాత్రం ఇక మళ్ళీ పుట్టనవసరం లేదు ! "

తపోలోకంలో ' జ్ఞానం ' అంకురిస్తుంది. జ్ఞానం ' ప్రజ్ఞానం ' గా మారిన తక్షణం సత్యలోకం ప్రాప్తిస్తుంది. సత్యలోకంలో ప్రజ్ఞానం విశ్వరూపం దాల్చి ' విజ్ఞానం 'గా రూపొందుతుంది. అందుకే జ్ఞానం వచ్చినా లాభం లేదు. తపోలోకం చేరినా పుట్టక తప్పదు. సత్యలోకం చేరి ప్రజ్ఞానం, విజ్ఞానం సంతరించుకుంటే కానీ ఇది తప్పదు.

తపోలోకంలో జ్ఞానం అంకురిస్తుంది. అంతకు ముందున్న ' మహోలోకం ' లో అంటే విశుద్ధ చక్రంలో జ్ఞానానికి అర్హత లభిస్తుంది. విశుద్ధ చక్రస్థితి అంటే మనిషి గతజన్మలో చేసిన చెడు కర్మలన్నీ శుద్ధం అయి నాడీమండలం ప్రక్షాళన అయిన స్థితి. అక్కడ నుంచి ఆరవ చక్రమైన ఆజ్ఞా చక్రంలోకి వెళ్ళినప్పుడు, దివ్య చక్షువు తెరుచుకున్నప్పుడు, దివ్యలోకానుభవాలు లభించి నప్పుడు వాళ్ళను " జ్ఞానులు " అని అంటాం.

జ్ఞానం లభించిన తర్వాత ఇంకా, ఇంకా ధ్యానం చేస్తూ ప్రజ్ఞానం స్థితిని పొందకపోతే వారిని " జ్ఞానమూర్ఖులు " అని అంటాం. ధ్యానం చేస్తూ, తమను తాము శుద్ధి చేసుకుని, నాడీమండలం శుద్ధి అయినా కూడా ఎవరైతే జ్ఞానం సంపాదించుకోడానికి ఇష్టపడరో వాళ్ళని " యోగ మూర్ఖులు " అని అంటాం ! అలాగే క్రింది మెట్టులో " అనాహత మూర్ఖులు " అంటే " వేదాంత మూర్ఖులు " వున్నారు. పుస్తక పరంగా " నేను దేహాన్ని కాను ", పుస్తక పరంగా " నేను ఆత్మని " పుస్తకపరంగా " అహం బ్రహ్మాస్మి " అని జీవితాల పర్యంతం వల్లె వేసేవాళ్ళు " వేదాంత మూర్ఖులు " !

ధ్యానం చేస్తూ, ధ్యానానుభవాలు వస్తున్నా ధ్యాన చక్షువు పొంది కూడు ఇంకా ఎక్కువగా ఉత్తేజ పరచుకోకుండా " యద్దృశ్యం తన్నశ్యం ", " ఇదంతా మాయా ప్రపంచం " అని అక్కడే ఆగిపోతే వారిని " యోగ మూర్ఖులు " అని అంటాం. యోగం అంటే మైండ్‌ని కంట్రోలు చేసుకోవడం. దివ్యచక్షువు ద్వారా కొంత తెలుసుకుని అక్కడే ఆగిపోయిన వారిని " జ్ఞాన మూర్ఖులు " అని అంటాం. ఎందుకంటే దివ్యచక్షువే జ్ఞానచక్షువు ! ఆరవచక్రం జ్ఞానచక్షువు స్థితి. ఐదవ చక్రం విశుద్ధ స్థితి. యోగం వుంది కానీ జ్ఞానంగా మారలేదు వీరే " యోగ మూర్ఖులు ".

" అనాహతం " అంటే " చప్పుళ్ళు లేని స్థితి "; " ఆహతం " అంటే " చప్పుడు ".

" అనాహతం " అంటే " నిశ్శబ్దంగా వుండే స్థితి ". అనాహతస్థితిలో, పండితుడిలో వుండే చప్పుళ్ళు లేవు. ఆయన నిశ్శబ్దంగా అంటే ' వేదాంతి 'గా అయిపోతాడు. అక్కడే వుండి పోయి ధ్యానం చేయకపోతే, అంటే ' యోగి 'గా ఎదగకపోతే - అలాంటి వారిని " వేదాంత మూర్ఖులు " అని అంటాం.

మన భారతదేశంలో ఎంతో మంది, వేల సంఖ్యల్లో, వేదాంత మూర్ఖులు వున్నారు. భగవద్గీతలో వున్నది కానీ, ఉపనిషత్‌లలో వున్నది కానీ, ఎంతైనా, చెప్పమంటే చెప్తారు గానీ ఒక్కరైనా చిత్త నిరోధం (mind control) చేయడానికి ప్రయత్నం చేయరు ! మన దేశంలో ఇలాంటి ఆచార్యులే

అనేకానేక యజ్ఞాలూ, వ్యర్థమైన కర్మకాండలూ చేస్తూ వుంటారు.

నిజమైన జ్ఞాన పిపాసకులు ఒక్క నిమిషమే అనాహతంలో వుండి, ధ్యాన సాధన ద్వారా విశుద్ధంలోకీ మరి విశుద్ధం నుంచి నిజమైన జ్ఞాన ఉపాసకులు ఇంకా ముందుకు పోయి దివ్యచక్షువుని ఉత్తేజపరచుకుని దివ్య అనుభవాలైనటువంటి ఎన్నో సూక్ష్మ లోకాలను దర్శించి ఆరవ చక్రస్థితి అయిన ఆజ్ఞాచక్రం నుంచి ఏడవదైన ' సహస్రారం ' అంటే ఆత్మవిజ్ఞాన స్థితిని పొందాలని ఉవ్విళ్ళూరేవారు !

కేవలం తమకు వచ్చిన జ్ఞానం మీదే ఆధారపడకుండా లోబ్‌సాంగ్ రాంపా, అనీ బిసెంట్, లెడ్ బీటర్ లాంటి మహా ఆత్మవిజ్ఞానుల పుస్తకాలు చదువుతూ, ధ్యానంలో ఇతర లోక గ్రేట్ మాస్టర్స్ కనబడినప్పుడు సంతోషిస్తూ, అక్కడే వుండక వారిని జిజ్ఞాసతో తమ తమ పూర్వజన్మల గురించి గానీ, సృష్టి రహస్యాల గురించి గానీ తరచి తరచి ప్రశ్నించి, సర్వ సమాధానాలూ పొంది ఆత్మ విజ్ఞానాన్ని నిరంతరం సముపార్జించే ఆత్మ విజ్ఞాన విద్యార్థులు మరి ఎంతటి అభినందనీయులో !

జ్ఞాన చక్షువుని ఉత్తేజ పరుచుకుని ఇంకా అక్కడే ఆగిపోయి విజ్ఞానాన్ని సంతరించు కోకుండా ఉన్న వాళ్ళని " జ్ఞాన మూర్ఖులు " అని అంటాం ! ధ్యానంలో కనబడిన మాస్టర్లని గానీ, బయట వున్న మాస్టర్లని గానీ, గ్రంథ రూపంలోని మాస్టర్లని గానీ పూర్ణంగా వుపయోగించుకోవడమే ఆత్మవిజ్ఞానుల యొక్క లక్షణం. కేవలం " నాకు ధ్యానంలో Mind Control అయిపోయింది; బుద్ధుడు కనబడ్డాడు; ఇంకెవరో Astral Masters దర్శనం ఇచ్చారు అని అక్కడే ఆగిపోకూడదు ! వారిని పట్టుకుని మనకు తెలియని విషయాల గురించి అడిగి, కడిగి తెలుసుకోవాలి ! మనం అనంతమైన ఆనందానికి దారి అయిన ఆత్మవిజ్ఞానాన్ని మాత్రమే ఎల్లప్పుడూ కోరుకోవాలి !

అందుకే ' జ్ఞాని ' అయినవాడు ' విజ్ఞానాన్ని ' కోరుకోవాలి. ' యోగి ' అయిన వాడు ' జ్ఞానాన్ని ' కోరుకోవాలి. వేదాంతి ' యోగాన్ని ', అలాగే పండితుడు ' వేదాంతాన్ని ' కోరుకోవాలి. పండితుడు " మణిపూరక " చక్రానికి చెందినవాడు. రామాయణ, మహాభారతాలు చక్కగా చెప్తాడు. కానీ ఇంట్లో కూడా రామాయణ, మహాభారత యుద్ధాలే వుంటాయి !

వీళ్ళు తమ పాండిత్యాన్ని వేదాంతంగా మార్చుకోకపోతే " పండిత మూర్ఖులు " లేదా " మణిపూరక చక్రమూర్ఖులు " గానే వుంటారు !

అలాగే వేదాంతం చెప్తూ చెప్తూ యోగానికి ఎదగకపోతే " వేదాంత మూర్ఖులు " లేక " అనాహత మూర్ఖులుగా " నే వుంటారు. అలాగే " యోగ మూర్ఖులు " - ఎంత సేపూ ముక్కు మూసుకుని కూర్చుంటారే తప్ప దివ్య చక్షువుని ఉత్తేజింప చేయరు. మీరు " విశుద్ధచక్రం " లోనే చిక్కుకుని పోయినవారు.

అలాగే నాస్తికులు, " మూలధార చక్రం " లోని వారు ! ఆస్తికులు " స్వాధిష్ఠాన చక్రం " లోని వారు ! పండితులు " మణిపూరక చక్రం " లోని వారు. వేదాంతులు " అనాహత చక్రం " లోని వారు. యోగులు " విశుద్ధ చక్రం " లోని వారు. జ్ఞానులు " ఆజ్ఞాచక్రం " లోని వారు. " సహస్రారం " అనేది ఓ చక్రం కాదు ! అది ఒక స్థితి ! మొత్తం " ఏడు స్థితులు " వున్నాయి; ఆరు చక్రాలు వున్నాయి. సహస్రార స్థితికి చేరుకున్న వారు తిరిగి ఈ భూమండలంలో జన్మించనవసరం లేదు. ఎక్కడికి వెళితే తిరిగి వస్తామో దాన్ని ఆ చక్రస్థితి యొక్క పరిధి అంటాం.

సహస్రార స్థితి ' చక్రం ' అనబడదు ! ఎందుకంటే ఆ స్థాయికి వెళ్తే ' చిక్కుకు పోవడం ' అన్నది వుండదు ! ఎందుకంటే అక్కడ విజ్ఞానం అనంతంగా, క్రమబద్ధంగా సాగిపోతూ వుంటుంది. ఇక్కడ చిక్కుకుపోవడం అంటూ వుండదు. ఆరవది అయిన ఆజ్ఞాచక్రంలో కూడా చిక్కుకుపోవడం అంటూ వుంటుంది. కానీ ఏడవదైన సహస్రార స్థితిలో, అంటే విజ్ఞాన స్థితిలో, ఈ జనన మరణ చక్రాల్లో చిక్కుకు పోవడం జరగదు.

ఆ క్రమాన్ని తెలుసుకోవడమే ' ఆత్మ విజ్ఞానం ' అనబడుతోంది ! నాస్తికులు మూలాధారులు. " మా కంటికి మూలం - అంటే దేవుడు వున్నాడు అనే దానికి దృష్టాంతం - అంటే ఆధారం చూపించండి " అనే వాళ్ళు అందుకే శ్రీ సత్యసాయి లాంటి యోగీశ్వరులు మహిమలు చూపి, దివ్య ఆధారాలు చూపించి నాస్థికులను ఆస్థికులుగా మార్చడానికి తమ వంతు కృషి చేస్తుంటారు.

ఆస్తికులు అయిన వారు ఆ తర్వాత పండితులుగా మారాలి. మొదట తమ మతాల మూలగ్రంథాలూ, తరువాత ఇతర మతాల మూలగ్రంథాలూ చదవాలి. తద్వారా ఆత్మ పాండిత్యాన్ని సంపాదించుకుని వేదాంతులుగా మారి తర్వాత ధ్యాన యోగం ద్వారా ఆత్మజ్ఞానం యొక్క సుగంధం తెలుసుకుంటూ, మనస్సును నిశ్చలం చేసుకుంటూ, ధ్యానం చేస్తూ, దివ్యచక్షువును తెరిపింప చేసుకుంటూ, దివ్యచక్షువును ఉపయోగించుకుంటూ, రీసెర్చి చేస్తూ, ఆత్మలో విహరిస్తూ ఆత్మవిజ్ఞానాన్ని సంతరించుకోవాలి. ఇదంతా ఒక అనంతమైన ఆనందయాత్ర ! ఇది భూమండంలో అంతిమయాత్ర ఆత్మవిజ్ఞానిగా కొనసాగడమే భూలోక సృష్టిలో అంతిమ యాత్ర.

మూలాధార చక్రం నుంచి ప్రయాణం చేయడం అంతం ఉన్న యాత్ర. మూలాధారంలో వుండి నాస్తికంగా మరణిస్తే మళ్ళీ పుట్టాలి. శుద్ధ ఆస్తికంగా వున్న వాళ్ళు కూడా మళ్ళీ పుట్టాల్సిందే ! ఆస్థికంలో కొంతమంది " ఆస్థిక మూర్ఖులు " వున్నారు. " మేం చెప్పిందే కరెక్ట్ " అనే వాళ్ళు " తిరుపతి వెంకన్న కరెక్ట్ ", " మక్కా లోనే పుట్టాలి; అక్కడే మరణించాలి ", " జీసస్ ఒక్కడే దేవుని కుమారుడు " - ఈ విధంగా అనే వాళ్ళంతా ఆస్థిక మూర్ఖులు. అస్థికత మంచిదే కానీ ఆస్థిక మూర్ఖత పనికిరాదు.

అలాగే పండితుడు ఎన్నో శ్లోకాలు వల్లెవేస్తారు. పేరు ప్రఖ్యాతులకు పోతారు. కానీ వారు తెలుసుకున్న జ్ఞానాన్ని అభ్యాసం చేయడానికి ఇచ్ఛగించరు. కేవలం పాండిత్యానికే పరిమితమైనవారు మణిపూరక చక్రంలో ఇరుక్కున్నవారు. మణిపూరక చక్రంలో వుండేవారు అంటే " మణితో పూరింపబడినవారు ". పైకి మాత్రం ' మణి ' మరి లోపల అంతా ' డొల్లే ! ' పండితుడు పైన " ఊపర్ షేర్వానీ, అందర్ పరేషానీ ! " - పైకి తెలిపినట్లుగా మాట్లాడుతాడు కానీ లోపల నాకు నిజంగా తెలియదు. అలాగే స్వాధిష్టాన చక్రం వాడు ' స్వ + అధిష్ఠానం ' అంటే " అంతా నేనే " అనే అహంకారం ప్రదర్శించేవాడు.

ఉదా: ' వైష్ణవులు ', ' శైవులు ', ' శాక్తేయులు ' ఇలా ఎవరికి వారు " మాది గొప్ప అంటే మాది గొప్ప " అని వితండవాదం చేసే వారే సామాన్య ఆస్తికులు. నిజానికి ఇదంతా శోచనీయం !

ఈ విధంగా అన్ని చక్రాలకూ ఆ యా పేర్లు చాలా కరెక్టుగా పెట్టారు - మహర్షులు లేదా మహాద్రష్టలు !

" మూలాధారం " లో వున్నవాడు " మాకు ఏదైనా ఆధారం చూపించండి " అని అంటాడు. అలాగే " అనాహతం " లో వున్నవాడు, అంటే వేదాంతి, అంటే చప్పుడు లేనివాడు, " అంతా దైవమాయ " అని శాంతంగా వుంటాడు. వేదాంతికి గ్రంథ పరిచయం మాత్రం వుంటుంది. అంటే ' సూక్ష్మ ', ' కారణ, మహాకారణ ' శరీరాలు అంటూ బట్టీ పడతాడు. కానీ అనుభవ పూర్వకమైన పరిజ్ఞానం (ప్రాక్టికల్ నాలెడ్జ్) ఏమీ వుండదు. సత్యాన్ని స్వానుభవంలోనికి తెచ్చుకోవడానికి ఇష్టపడనివాడు వేదాంత మూర్ఖుడు !

కానీ " సూక్ష్మ, కారణ శరీరాలను ధ్యానం ద్వారా అనుభవంలోనికీ తెచ్చుకోవాలి " అని అనుకునేవాడు ' యోగి ' అనబడతాడు. వేదాంతి ధ్యానం చేయడు. తనకి అవసరం లేదని అనుకుంటాడు ! తనకు " ఆత్మ గురించి అంతా తెలుసు " అని అనుకుని అక్కడే చిక్కుకుని పోతాడు. కేవలం " పుస్తక జ్ఞానం " అన్నది ఎంత మాత్రం పనికి రాదు; అనుభవైక జ్ఞానమే కరెక్టు ! ధ్యాన యోగం అంటే తీపిని నోట్లో పెట్టుకోవడం ! ఆకలి తీరినవాడు ! ఓ వేదాంతి స్వీట్‌ని వాసన మాత్రమే చూసి " చాలు " అనుకున్నవాడు.

ధ్యానం ద్వారానే అనుభవజ్ఞానం వచ్చి ఓ ధ్యాన సాధకుడు విశుద్ధుడు అవుతాడు. అంటే అనేక జన్మల చెడు సంస్కృతి అంతా ఈ " ఆనాపాన సతి " అనే సరియైన ధ్యాన పద్ధతి ద్వారా ప్రక్షాళన చేయబడి మరి పరిశుద్ధుడవుతాడు. యోగి అయిన వాడికి కొంతకాలం తరువాత ధ్యాన చక్షువు ఉత్తేజిత మవుతుంది. కానీ ఇంకా " వేదాంత వాసనలు " పోని ఒకానొక యోగి " యద్దృశ్యం తన్నశ్యం " అనుకుంటూ ధ్యానంలో కలిగే అనుభవాలను సత్యం అని గ్రహించక " ఇవన్నీ మనస్సు యొక్క ఊహాగానాలే చిత్కళలే " అని సమాధాన పడి ఆ చక్రంలోనే ఇరుక్కుంటే " యోగమూర్ఖు " డవుతాడు ! వాడు ఇంకా జ్ఞాని కాలేదు కానీ పిరమిడ్ మాస్టర్ల సహచర్యంతో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ వారి ఆధ్యాత్మిక శాస్త్ర విజ్ఞాన పుస్తకాలతో

మరి ఇతర థియోసాఫికల్ పుస్తకాల పఠనంతో యోగం నుంచి పైకి ఎదిగి జ్ఞానాన్ని సంపాదిస్తాడు. అలాగే దివ్య చక్షువు అనుభవాలు పొందినా ' జ్ఞానం ' నుంచి ' ప్రజ్ఞానం ' నుంచి ' విజ్ఞానం 'గా మారకపోతే వాడిని " జ్ఞాన మూర్ఖుడు " అని మనం అంటాం. అంటే ఆరవ చక్రంలోనే, ఆజ్ఞా చక్రంలోనే అతడు వుండి పోతాడు.

ఆరవ చక్రస్థితి బ్రహ్మలోకం ! బ్రహ్మలోకానికి వెళ్ళినా మళ్ళీ పుట్టాల్సిందే ! ఆత్మజ్ఞానం బీజమాత్రంగా వున్నా మళ్ళీ పుట్టాల్సిందే. ఈ భూమి మీదే ఆత్మజ్ఞానం వృక్షంలాగా అంటే ఆత్మవిజ్ఞానం స్థాయి (అంటే సహస్రారస్థితి)కి ఎదిగితే తప్ప పూర్ణముక్తి లభించదు.

" ఆరవ చక్రమైన బ్రహ్మలోకంలో వున్నా, నేను వుండే ' సత్యలోకం ' అంటే సహస్రారస్థితికి చేరుకుంటే గానీ, నీకు జనన, మరణాలు అనే ఈ ' చక్ర భ్రమణం ' తప్పదు " అని శ్రీకృష్ణుడు చక్కగా చెప్పాడు.

ఆజ్ఞాచక్రంలో ' రెండు దళాలు ' వుంటాయి; కానీ సహస్రార స్థితిలో వేయి రేకులు వుంటాయి ! అంటే ఆజ్ఞా చక్రస్థాయి నుంచి ఐదు వందల రెట్లు అధికంగా ధ్యాన సాధన చేస్తేనే సహస్రార స్థితికి చేరుకుంటాం. " ఆ స్థితి పొందినవాడు, నాతో సమానంగా సత్యలోకంలో విహరిస్తాడు " అని శ్రీకృష్ణ ' పరమాత్మ ' చెప్పారు. అంటే " మూలాధార నాస్తికస్థాయి " నుంచి అత్యంత విశిష్టమైన, అనంతమైన " ఆత్మవిజ్ఞాన " స్థాయికి ఒకానొక ' ఆత్మ ' ఎదిగిందన్నమాట.

శ్రీకృష్ణుడు ఇంత చక్కగా చెప్పినా అది వేదాంతులకి సరిగ్గా అర్థం కాలేదు ! సగం అర్థం అయిన స్థితిలో వారు విపరీతార్థాలు చెప్పి సామాన్య జనులను తప్పుదోవ పట్టిస్తున్నారు ! తమ తమ దివ్య చక్షువులను వుత్తేజిత పరచుకున్న వ్యాసుడు, వాల్మీకి, సిద్ధబ్రహ్మేంద్రస్వామి లాంటి వాళ్ళే భగవద్గీతను సరిగ్గా అర్థం చేసుకున్నవారు ! సత్యం తెలుసుకోవాలంటే అందరం విధిగా యోగీశ్వరులు కావాల్సిందే ! సత్యం తెలుసుకోవాలంటే అందరూ విధిగా యోగీశ్వరులు కావాల్సిందే ! అన్యథా శరణం నాస్తి !

ఈ భూమండలంలో అత్యధిక శాతం మూలాధార స్థితిలో వున్నవారు.

అలాగే ఎంతోమంది స్వాధిష్ఠాన స్థితిలో ఆస్తికుల్లాగా వున్నారు. కొంతమంది పండితులు. ఇంకొంతమంది వేదాంతులు. అతికొద్దిమంది యోగులు. మరి ఇంకా కొద్ది మంది మాత్రమే జ్ఞానులు వున్నారు. ఇక వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు ఆత్మవిజ్ఞానులను ! అలాంటి ఆత్మవిజ్ఞానులే " నన్ను చేరుకున్న వారు " అని శ్రీకృష్ణుల వారు చెప్పారు !

సిద్ధత్వ స్థితి ఆరవచక్రం, బుద్ధత్వ స్థితి సహస్రార స్థితి ! సిద్ధత్వ స్థితి కోసమే అతికొద్దిమంది పాటుపడతారు. ఇంక అంతకన్నా పై స్థితిలో వున్న బుద్ధత్వ స్థితి మాటేమిటి ? !

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీవారు ' ఆత్మవిజ్ఞానా ' న్ని అంటే ' స్పిరిచ్యువల్ సైన్స్ ' ని అందరికీ అందిస్తున్నవారు !

ఎవరయ్యా " నిజమైన ఆచార్యులు " అంటే -

" యః యాచినోతి, ఆచరతి,
ఆచారయతి చ స ఆచార్యః "

యః యాచినోతి = ఎవరైతే జ్ఞానాన్ని యాచిస్తారో

ఆచారయతి = ఎవరైతే అందరినీ ఆచరింప చేస్తారో

స ఆచార్యః = వారినే మనం ఆచార్యులు అని అంటాం.

కనుక, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు ఏది యాచిస్తారు ? ఆత్మ విజ్ఞానాన్నే ! ఆత్మ ' జ్ఞానాన్ని ' కాదు ! ఆత్మ ' ప్రజ్ఞానాన్ని ' కాదు ! జ్ఞానం, ప్రజ్ఞానం అన్నది వారికి చాలా తక్కువ !

వారు యాచించేది ' ఆత్మవిజ్ఞానాన్ని ' ! వారు దేన్ని ప్రబోధిస్తారు ? ఆత్మ విజ్ఞానాన్నే ప్రబోధిస్తారు ! వారు దేన్ని ఆచరింప చేస్తారు ? వారు ' ఆత్మ విజ్ఞానాన్నే ' ఆచరింపచేస్తారు !

ఎవరైనా పిరమిడ్ మాస్టర్స్‌కు క్రొత్తగా ఆత్మ ' జ్ఞానాన్ని ' చెప్తూంటే వారికి అది అంతగా రుచించదు. ఎందుకంటే అది వారికి ABC లు గనుక ! వారు ' MNOP ' అనే ఆత్మప్రజ్ఞాన స్థాయిలో కూడా కాకుండా ' XYZ ' అనే ఆత్మవిజ్ఞాన స్థాయిలో వున్నవారు తనుక ! ఇదే వారి అఖిల

జన్మ ! ఇంక వారు ఈ భూమి మీద నేర్చుకోడానికి ఏమీ లేదు. తాము నేర్చుకున్నదంతా, తమకు వున్నదంతా అందరికీ పంచేసారు.

ఇదీ పిరమిడ్ స్పిరిచ్యువల్ మాస్టర్స్ యొక్క విశేషమైన స్థితి !

" ఆత్మజ్ఞాని " అయినవాడు తనకు తెలిసింది అందరికీ బోధించడానికి పూనుకోవాలి. బోధన చేస్తే తనకు వున్న జ్ఞానం పెరుగుతుంది. అందుకే " Teaching is the best way of Learning " అని అంటారు. బోధన చేస్తూ వుంటే మిగతా వారి ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పాలి. కాబట్టి తాను జ్ఞానానికి సంబంధించిన ఇతర పుస్తకాలు చదవడం, ఇతర మాస్టర్స్ యొక్క అనుభవాలు తెలుసుకోవడం చూస్తూ వుంటే, " ఆత్మప్రజ్ఞాని " గా అంటే పూర్ణసత్య బోధకుడుగా మారుతాడు. అలా పూర్ణసత్యబోధకుడు అయిన వాడే ఓ బోధిసత్వుడు. బోధిసత్వుడుగా అనేక జన్మల్లో వుంటూ ఆ ఆత్మప్రజ్ఞాని క్రమక్రమంగా " ఆత్మవిజ్ఞానాన్ని " సంతరించుకుని చివరికి " బుద్ధుడు " అవుతాడు.

ఓ అజ్ఞాని తన అంతర్ శత్రువుని అంటే అజ్ఞానాన్ని చంపుకున్నప్పుడు " అరిహంత్ " అవుతాడు. అతడే తర్వాత " బోధకుడు (బోధిసత్వుడు) " గా మారతాడు. బోధకుడు కాని వాడు, పరిశోధకుడు కాని వాడు బుద్ధుడుగా కాలేడు. బోధనల ద్వారా, పరిశోధనల ద్వారా మాత్రమే ఆత్మజ్ఞానం అన్నది ప్రజ్ఞానమై, తరువాత ఆత్మవిజ్ఞానమై విలసిల్లేది.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీల మాస్టర్లందరూ మొదటి రోజులోనే ఆత్మజ్ఞానాన్ని, ఆత్మ విజ్ఞానాన్ని తాము నేర్చుకుని రెండో రోజు నుండే ఆత్మవిజ్ఞానాన్ని బోధించే సమర్థులు, మరి బుద్ధత్వ అభిలాష వున్నవారు. వారు ఎలాంటి ఉన్నత స్థితిలో ఉన్నారో అందరూ గమనించవచ్చు.

పిరమిడ్ మాస్టర్లు ఏం బోధిస్తారు ? వారు రెండే రెండు బోధిస్తారు ! ఒకటి " హింసాఛోడో ! "; రెండు " హంసా పకడో ! ".

' హింస ' అంటే - తుచ్ఛమైన మాంసభక్షణ (జీవహింస); ' హంస ' అంటే ' శ్వాస ' ! ' హంసా పకడో ' అంటే ' శ్వాస మీద ధ్యాస ' (ఆనాపానసతి) ! ఎవరైతే ఈ రెంటినీ విని, వెంటనే ఆచరిస్తారో, వారికి

పూర్ణ నాడీమండల శుద్ధి జరిగి, దివ్య చక్షువు ఉత్తేజితమై, దివ్యానుభవాలు కలిగి, బోధిసత్త్వులై, ఇతర స్పిరిచ్యువల్ మాస్టర్లతో తమ ఈ అనుభవాలను కలిపి పంచుకుంటారో ఆ మాస్టర్ల యొక్క ఆనందమే ఆనందం ! ఆ ఆనందమే బోధిసత్త్వులకు ఆహారం ! పిరమిడ్ స్పిరిచ్యువల్ మాస్టర్లందరూ అందరి దగ్గరా కోరుకునేది ఇదే ! ఇంతకు మించి వారు కోరేదేమీ లేదు !

ధ్యాన పరాకాష్టలో వున్నప్పుడే, స్వాధ్యాయ పరాకాష్టలో, సజ్జన సాంగత్య పరాకాష్టలో వున్నప్పుడే, సదా ఆత్మవిజ్ఞాన వీచికల్లో వుంటాం. అల్ప ధ్యానం, అల్ప స్వాధ్యాయం, అల్ప సజ్జన సాంగత్యం వీటి ద్వారా ఆత్మజ్ఞానంలో వుంటాం గానీ ఆత్మవిజ్ఞానులుగా మాత్రం మారం ! చిట్ట చివరకు ప్రతి ఒక్కరూ, అందరూ, ఆత్మవిజ్ఞానులై తీరవల్సిందే ! అది ఒక నిరంతర ప్రవాహం ఎప్పుడూ వుంటూనే వుంటుంది.

రమణ మహర్షి గారు - ఆయన ఆత్మప్రజ్ఞాని - ఆయన జ్ఞానాన్నీ ప్రజ్ఞానాన్నీ అందించారు. ఆయన ఆత్మవిజ్ఞాని కారు ! ఆయన దగ్గరకు ఆత్మజ్ఞానం, మరి ఆత్మప్రజ్ఞానం కోసం పోవచ్చు; కానీ ' ఆత్మవిజ్ఞానం ' కోసం మాత్రం ఇంకో మాస్టర్‌ను ఖచ్చితంగా వెతుక్కోవలసిందే !

మనం అన్నీ అందరి దగ్గరు నుంచి ఇంకా, ఇంకా ఎక్కువగా నేర్చుకునే ప్రయత్నం చేయాలి. ' తిరుపతి ' ఒక పట్టణమే, కానీ దాని కంటే ' చెన్నై ' ఇంకా పెద్దది. అలాగే ' వాషింగ్టన్ ', ' న్యూయార్క్ ' అన్నవి మరి ' చెన్నై ' కన్నా పెద్దవి ! అలాగే యోగులలో, మాస్టర్లలో ఒకరిని మించి ఇంకొకరుంటారు. మనం ఒక్కరి దగ్గరే వుంటే " కూపస్థ మండూకాల్లాగా మన జ్ఞానం " ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఆ స్థాయిలోనే నిలిచిపోయి వుంటుంది.

రమణ మహర్షి ఆత్మప్రజ్ఞానం కోసం ' విచారణ ' అనే మార్గం ఇచ్చారే కానీ, ' యోగం ' అనే మార్గం ఇవ్వలేకపోయారు ! ' విచారణ ' అనేది ' వేదాంతం 'కు దారితీస్తుందే గానీ స్వానుభవానికి దారితీయదు ! అందుకే వారి అనుయాయులు ఎవ్వరూ కనీసం ఆత్మజ్ఞానులుగా అంటే కనీసం యోగులుగా కూడా తయారుకాలేక పోయారు.

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారి దగ్గరికి అయితే మనం యోగం గురించి నేర్చుకోవడానికి, మరి దాని ద్వారా ఆయన లాగా దివ్య చక్షువు (అంటే దివ్యదృష్టి)ను ఉత్తేజింప చేసుకోడానికి మనం తప్పకుండా వెళ్ళవచ్చు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు అనేకానేక జన్మల్లో ' అరిహంతులై ', ' బోధిసత్వులై ' విలసిల్లిన వారు. అప్పుడు ' బుద్ధుళ్ళు 'గా కొంతమంది అయ్యారు. కొంతమంది కాలేకపోయారు. కనుక ఈ జన్మలో అందరూ ' బుద్ధుళ్ళు 'గా కావడానికి అవతరించారు !

" పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ' ' అన్నది బుద్ధుళ్ళ మయం ! - అంటే ఆత్మవిజ్ఞానుల మయం ! పిరమిడ్ స్పిరిచ్యువల్ మాస్టర్లందరూ తమ తమ చివరి జన్మల్లో వున్నవారు. అంటే ఆత్మవిజ్ఞాన భూమికల్లో వున్నవారు. చివరి జన్మ భూమికే ఆత్మ విజ్ఞానం.

నేను గతంలో మద్రాసు అడయార్‌లో అనీ బిసెంట్ స్థాపించిన థియోసాఫికల్ సొసైటీకి ఆత్మవిజ్ఞానం కోసం వెళ్ళాను. అక్కడ పుస్తకపరంగా ఆత్మవిజ్ఞానం వుంది. కానీ ధ్యానం, అంటే యోగం, ఎవ్వరూ సరిగ్గా చేయటం లేదు ! పూర్వకాలంలో అనీ బిసెంట్, లెడ్ బీటర్ లాంటి మహాయోగులూ వున్నారు. కానీ ఇప్పుడు అక్కడ వున్న వారందరూ పుస్తకపరంగా ఆత్మవిజ్ఞానాన్ని ఆస్వాదిస్తున్నారే గానీ అనుభవం కోసం ఎక్కువ మంది సాధన చేయడం లేదు !

ఉపనిషత్‌లలో, వేదాల్లో ఆత్మజ్ఞానం, ఆత్మ ప్రజ్ఞానం అన్నవి వున్నాయి గానీ ఆత్మవిజ్ఞానం మటుకు లేదు ! థియోసాఫికల్ సొసైటీలో ఆత్మవిజ్ఞానం పుస్తకరూపంలో వుంది గానీ యోగులు అంటే ధ్యానం చేసేవారు అరుదుగా వున్నారు. అందుకే మనం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీలు అందరినీ యోగులుగా, ఆత్మవిజ్ఞానులుగా మార్చడానికి శంఖారావం పూరిస్తున్నాం.

ఈ ప్రపంచంలో రకరకాల మనుష్యులు వున్నారు. వారందరూ వివిధ రకాల ఆత్మస్థాయిల్లో వున్నవారు.

## ఓ శైశవాత్మ

ఈ ఆత్మస్థితిలో వున్నవారు ఎవరు ఏది చెప్పితే అది వింటారు. " నన్ను చేయి పట్టుకు నడిపించు " అన్నట్లుగా హిందువులుగా పుడితే గుడికీ, మహ్మదీయులుగా పుడితే మసీదుకూ వెళ్ళి వస్తూంటారు. వీరు మూలాధార చక్రంలో వున్నవారు.

## ఓ బాల్యాత్మ

ఈ ఆత్మస్థితిలో వున్నవారు కొంచెం అథారిటీ చూపిస్తారు. అందరినీ " గుడికి పదండి ", " చర్చికి వెళ్ళండి ", " మసీదుకు పదండి " అని మిగతా శైశవాత్మల మీద పెత్తనం చేసే స్థాయి అన్నమాట. వీరు స్వాధిష్ఠాన చక్రానికి చెందినవారు.

## ఓ యువాత్మ

ఈ ఆత్మస్థితిలో వున్నవారు పీఠాధిపతులు, మఠాధికారులు, రాజకీయ నాయకులు మొదలైనవారు. " మా మతమే గొప్పది ", " మా పార్టీయే గొప్పది " అని తమకు తాము గొప్పగా చెప్పకునే వారు. వీరు మణిపూరక చక్రానికి చెందినవారు. పై పైన మణితో పూరించబడి లోపలంతా డొల్లగా వున్నవారు.

## ఓ ప్రౌఢాత్మ

ఈ ఆత్మస్థితిలో వున్నవారు శాంతంగా, అహింసాయుతంగా వుండి గొప్ప క్రికెటర్‌గానో, గొప్ప పెయింటర్ గానో, లేదా గొప్ప వ్యాపారం చేస్తూనో, లేదా కర్మయోగం లోనో వుంటారు తప్ప ధ్యానం చేయరు. వీరు ఇంకా ఆత్మజ్ఞాన పరిధిలోకి రానివారు. వీరు అనాహత చక్రంలో వున్నవారు.

## ఓ వృద్ధాత్మ

ఈ ఆత్మస్థితిలో వున్నవారు " నేను ఎవరు ? ", " ఎక్కడ నుంచి వచ్చాను? ", " ఈ సృష్టి రహస్యం ఏమిటి ? ", " భగవత్ తత్త్వం ఏమిటి ? " - అని జిజ్ఞాసువులుగా వుండే ఆత్మస్థితి. ఈ స్థితి నుంచే

మొట్టమొదటి సారిగా ధ్యానాభిలాష మొదలవుతుంది. వీరు ధ్యాన సాధన మొదలు పెట్టినవారు, ధ్యానాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నవారు; విశుద్ధచక్రంలోని వారు వీరు.

## ఓ విముక్తాత్మ

తాము ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకుని తాముగా అరిహంతులయిన తరువాత వృద్ధాత్మలను విముక్తులను చేయడానికి నిరంతర కృషి చేస్తూంటారు. వీరే ధ్యానంలో మనకి కనిపించే ఆస్ట్రల్ మాస్టర్స్

## ఓ పరమాత్మ

ఒకానొక విముక్తాత్మ ఎంతో మందిని ఆత్మవిజ్ఞానులుగా తయారు చేయగా, చేయగానే " పరమాత్మ స్థాయి " కి చేరుకుంటుంది. ఈ ఆత్మస్థితి అన్ని ఆత్మస్థితుల లోనూ అత్యంత ఉచ్ఛస్థితి అన్నమాట.

శివుడు, పార్వతి, బ్లావెట్స్కీ, డాన్ యువాన్ - లాంటి వారు ఇప్పుడు ' పరమ ఆత్మ ' స్థాయిలో వున్నారు. ఒక ' పరమాత్మ ' మాత్రమే ఇంకొక ' పరమ ఆత్మ ' ను అర్థం చేసుకోగలదు. ఈ ఆత్మ యొక్క పూర్ణ పరిణామ క్రమాన్ని, పూర్ణ అందచందాలను తెలుసుకోవడమే " ఆత్మ విజ్ఞానం " అనబడుతుంది.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు నిర్దేశించిన పుస్తకాల లాంటివి చదివితే అఖండమైన ఆత్మవిజ్ఞానం లభిస్తుంది ! పిరమిడ్ స్పిరిచ్యువల్ మాస్టర్ల ధ్యానానుభవాలను వారి ముఖత: వింటే అఖండమైన ఆత్మవిజ్ఞానం లభ్యమవుతుంది ! నిరంతరంగా ధ్యానం చేస్తూ వుంటే దివ్య చక్షువు ఉత్తేజితం అయిన తరువాత ధ్యానంలో కనబడిన మాస్టర్లని ఉపయోగించుకుంటే అఖండమైన ఆత్మవిజ్ఞానం లభిస్తుంది !

ఇదీ ' ఆత్మ ' యొక్క పూర్తి పరిజ్ఞానం.

- సుభాష్ పత్రి


ధ్యానలహరి ఫౌండేషన్